# నాకు నచ్చిన నా కథ

తరం అంతరాల్లో అభిమానాలు, ఆప్యాయతలు, యెలా మార్పుచెందుతూ వుంటాయో వాటి పర్యవసానం యెటువంటి దుష్ఫలితాలకు దారితీస్తుందో చెప్పే ఓ చిన్న కథ యిది. రామయ్యలాంటి పేదవాడికి వూపిరిపోసుకున్న ఆత్మాభిమానం, ఆతడి వూపిరి ఆగిపోవడానికి కారణభూతమయ్యింది. దీనికి మూలహేతువు గంగరాజులాంటి వ్యక్తుల ప్రవర్తనే అందుకు భిన్నమైనది రమణయ్య మనస్తత్వం.

ఈ కథ తేదీ 22-3-74 ఆంధ్ర వారపత్రికలో ప్రచురింపబడింది.



ముద్దంశెట్టి హనుమంతరావు

## కొత్త బట్టలు

అరవై అయిదేళ్ళు మీదపడినా, నిటారుగా నడుస్తూ వచ్చాడు రామయ్య. అతని జుత్తు బాగా నెరసి సంస్కార రహితంగా వుంది, మొహం మీద ఒత్తుగా పడిన ముడతలు అతను గడించిన జీవితానుభవానికి నిదర్శనంగా అగుపిస్తున్నయ్.

గంగరాజు మొహం దించుకుని యేదో రాసుకుంటున్నాడు. రామయ్య

రావడం అతను గుర్తించినా మొహమెత్తి చూశ్చేదు "నమస్కారం గంగరాజు బాబూ" అన్నాడు, కొద్దిగా వొణుకుతున్న చేతులు జోడిస్తూ

గంగరాజు తలెత్తాడు

"ఏమిటి రామయ్యా, ఇలా వచ్చావు? ఈ వయసులో ఎందుకిలా తిరగడం ఇంట్లో కూచుని విశ్రాంతి తీసుకోకూడదూ?" అన్నాడు జేబులోంచి సిగరెట్ తీసి వెలిగిస్తూ.

రామయ్య విందుగా నవ్వేడు "ఇంట్లో కూసుంటే మరింత నీరసంగా ఉంటాది బాబూ! ఇటూ అటూ తిరుగుతావుంటే కొత్త బలం వచ్చినట్టే వుంటాది అదీగాక ఇయ్యాళ అయ్యగార్ని కలుసుకు పోదామనే వొచ్చాను బాబూ।" సవిన యంగా అన్నాడు

'ఏమిటి సంగతి రామయ్యా।"

"రేపు కొత్త సంవత్సరం బాబూ! రేపు ఒక్క రోజు సరదాగా గడిపేయా లన్న ఓ కోరిక పుట్టేసింది కాటికి కాలుసాపుకున్న వోణ్ని ఇంక యెన్నాళ్ళో బతకను సచ్చిపోయేముందు ఈ ఒక్క పండుగా సరదాగా గడిపితే సాలనిపిస్తుంది బాబూ! తమరు దయతలిసి కొత్తబట్ట లిప్పిస్తే సంవత్సరం పొడుగునా తమరి పేరు సెప్పుకుంటాను ఏనాడూ యెరగని గడ్డురోజులొచ్చి నయ్ బాబూ। బట్టలకి శానా ఇబ్బంది పడతన్నాను బాబూ।" ప్రాధేయపూర్వకంగా అన్నాడు రామయ్య

గంగరాజుకి రామయ్య కోరిక ఆశ్చర్యం కలిగించడమే గాకుండా, ఒక వేపు చిరుకోపమూ తెప్పించింది 'అడుక్కోవడంలోకూడా యెంత దర్పం' అనుకుంటూ వెటకారంగా ఓ నవ్వు నవ్వేడు

"బావుంది రామయ్యా నీ వరస నీ లాంటి పేదవాళ్ళు, కూటికీ, గుడ్డకీ కరువైన వాళ్ళు యెంతోమంది వున్నారీవూళ్ళో నువ్వొచ్చినట్టే, వాళ్ళంతా వచ్చి అడిగితే, అడిగినవాళ్ళందరికీ మేం యివ్వాలంటే, ఇహ మేం చిప్పట్టుకోవాల్సిందే! అయినా ఇటువంటి కోరిక లేమిటి? తిండి లేదు, తిండి పెట్టమంటే యెవరైనా హర్షిస్తారు కట్టుకుందుకు బట్టల్లేవు పాత బట్టలిమ్మంటే, యెవరైనా సమర్థిస్తారు అంతేకాని కొత్త బట్టలు కావాలనడం విన్నవాళ్ళకే యేదోలా అనిపిస్తుంది నాలుగు రాళ్ళు సంపాదించుకుంటున్నవాళ్ళే ఈ రోజుల్లో పండగలకీ, పబ్బాలకీ కొత్త బట్టలు వేసుకోలేకపోతున్నారు. ఇహ నీలాంటి

వాడికి యెట్లా వస్తాయి చెప్పు? పేరాసలొద్దు రామయ్యా, ఏదో యిట్లా కడుపు నిండుతున్నందుకు సంతోషపడు'' అన్నాడు.

రామయ్య మనసు చివుక్కుమంది. అతని మొహంలో మరిన్ని ముడతలు ఏర్పడినయ్. దట్టమైన కనుబొమలు రెండూ కలిశాయి. ఫాలభాగంపై చెమట బిందువులు మెరిసినై. పెదాలు యెందుకో వణికాయి. గంగరాజు నుంచి అతడు ఆ విధమైన జవాబును ఆశించలేదు. ఎంతగానో బాధపడ్డాడు. బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు.

''ఎంతో ఆశతో ఈ సివరి కోరిక కోరడానికి వచ్చాను బాబూ. నా ఆశల్ని ఒక్కమారు మట్టిపాలు పేపేసినారు. మీ నాన్నగారైతే, యిట్టా కర్రిరిసి నట్టు సెప్పివుండేవోరుకాదు....'' బాధపడుతూనే అన్నాడు రామయ్య.

గంగరాజులో యేమీ చలనం రాలేదు. వెటకారం వొలికేటట్టు ఓ చిన్న నవ్వు నవ్వేడు.

''ఆఁ.... ఆఁ.... చెప్పిఉండేవారు కాదు. నువ్వు కోరిందే తడవుగా, వున్నపాటున కొత్త పట్టుబట్టలు తెప్పించి, నిన్ను ముస్తాబుచేసి పంపేవారు. అంతే కదూ రామయ్యా నీ వుద్దేశం? కోరికలక్కూడా ఓ హద్దంటూ వుండాలి'' యెద్దేవా చేస్తున్నట్లుగా అన్నాడు గంగరాజు.

అప్పటికే కించపడుతున్న రామయ్యకి, గంగరాజు మాటలు సూదుల్లా గుచ్చుకున్నయ్. కళ్ళలో నీరు సుళ్ళుతిరిగింది. ఎంతో ఆశను మోసుకొనివచ్చాడు-పెద్దబాబుగార్ని అడిగి ఈ ఉగాదికి కొత్తబట్టలు కట్టుకోవాలన్న కోరికతో. కాని, చినబాబు మాటలు, అతని ధోరణి రామయ్య ఆశల్నీ వుత్సాహాన్ని క్రుంగ దీశాయి. ఇంకెక్కడో మిణుకు మిణుకు మంటోన్న ఆశ అణగారిపోలేదు. పేదవాడికి ప్రతిక్షణం ఆశతో నిండినదే మరి. పెద్దబాబుగార్ని కలుసుకుంటే తప్పకుండా ఫలితం వుంటుందన్న నమ్మకం రామయ్యలో ఆశాజ్యోతిని వెలిగించింది.

"తొందరపడి, మీ మాటలతో నన్ను అవమానించకండి బాబూ. మాలాంటోళ్ళ మీద మీకు కనికరమే వుండాలిగాని కక్ష కాదు బాబూ! పోనీ, పెద్దబాబుగోర్ని ఓమారు పిలికెయ్యండి. ఆయన నా మాట యింటే ఏం సెలవిస్తారో యినిపోతాను'' అన్నాడు రామయ్య.

గంగరాజుకి వొళ్ళు మండింది. రామయ్యకేసి తీక్షణంగా చూశాడు. వీడెంత మొండివాడేమిటి? అనుకున్నాడు మనసులో.

"ఏమిటి రామయ్యా, నీ వ్యవహారం చాలా దూరం పోతోందే. నీ గుండె ధైర్యానికి నేను ఆశ్చర్యపోతున్నాను. మా నాన్నగారు నీ విన్నపం వినడానికి లోపల్నుంచి పనిగట్టుకు రావాలా? పూటకి గతిలేనివాడివి నీ కింత పొగరా. అడుక్కుండుకొండా హోదావుండాలి గా మోసు. ఏం రోజులొచ్చాయిరా బాబూ! ఆఖరిసారిగా చెబుతున్నాను .. నన్ను రెచ్చగొట్టక వెళ్ళిపో...." కటువుగా అన్నాడు గంగరాజు.

రామయ్యకి యెవరో ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్టయ్యింది. క్షణంపాటు నోట మాటరాలేదు. అతని కళ్ళలో గూడుకట్టిన కన్నీరు చెక్కిళ్ళమీదికి జారింది. కళ్ళొత్తుకున్నాడు. "సరే బాబూ! వెళ్తాను...." దుఃఖాన్ని దిగమింగుకుంటూ, వెనక్కి తిరిగాడు రామయ్య. అతడి మనసు చీకటిమయమయ్యింది. ఈ తరం కుర్రాళ్ళ మనస్తత్వాన్ని అతడు హరించలేకపోయాడు. రెండడుగులు ముందుకు వేశాడు బరువుగా.

"రామయ్యా...." అప్పుడే లోపల్నుంచి వచ్చిన రమణయ్య పిలిచాడు.

రామయ్యకి ఆ పిలుపు మధురాతి మధురంగా వినిపించింది. అతని హృదయం సంతోషంతో పుప్పొంగిపోయింది. గాయపడిన మనస్సుకి ఊరట కలిగించిందా పిలుపు. వెనక్కి తిరిగాడు.

"నమస్కారం రమణయ్యబాబూ!" అన్నాడు ముందుకు నడుస్తూ. "వచ్చి మళ్ళీ వెళ్ళిపోతున్నావేం- కూర్చో!" అంటూ తను కుర్చీలో కూలబడ్డాడు రమణయ్య.

తండ్రి ధోరణి ఏనాడూ నచ్చలేదు... ఇప్పుడూ నచ్చలేదు గంగరాజుకి. అంతరాలు పాటించకుండా తండ్రి ప్రవర్తిస్తున్నందుకు ఆయన తత్వాన్ని మనసులో తిరస్కరించుకున్నాడు. బాహాటంగా తిరస్కరించే ధైర్యం లేదు గనుక.

రామయ్య సవినయంగా రమణయ్య ముందు నిల్చున్నాడు. "పరవాలేదులే బాబూ! ఏదో యిట్టా మిమ్మల్ని సూసిపోవాలని వచ్చేసు" కూర్చోకుండానే అన్నాడు రామయ్య. అనుకోకుండా రామయ్య గొంతు కంపించింది. అతని మొహంలో దైన్యాన్ని పసిగట్టేశాడు రమణయ్య.

"అదేమిటి రామయ్యా అలా ఉన్నావు. కళ్లు చెమ్మగిల్లినట్టున్నాయేవిటి? మొహం అలా వాడిపోయి వుందేం?" ప్రశ్నించాడు రమణయ్య.

రామయ్య పొడిగా నవ్వేడు. "వయస్సు మీదపడుతోంది కదా బాబూ,

కాటికి కాళ్ళు సాపుకున్నాము. నా కళ్ళల్లో నీరు కాపోతే, యింకేటి వుంటాది సెప్పండి" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అన్నాడు.

"ఇంతకీ నువ్వొచ్చిన పనేవిటో చెప్పావు కాదు రామయ్యా" అన్నాడు రమణయ్య.

రామయ్య ఆలోచనల్లో పడ్డాడు. తను వచ్చినపని చెప్పడమా, మానడమా అన్న సందిగ్ధంలో పడ్డాడు. ఒకప్రక్క గంగరాజు ప్రవర్తన బాధ, జుగుప్స కలిగిస్తున్నా, తన కోరిక తీర్చుకోవాలన్న ఆశ అతనిలో నశించిపోలేదు. అందు కనే గంగరాజు ప్రవర్తన విషయాన్ని ఓ పక్కకి నెట్టేసి తను ఎందుకు వచ్చిందీ చెప్పేయాలనుకున్నాడు.

"రమణయ్యబాబూ. మీరు పెద్దోరు. వయసులో కాపోయినా, అంతస్తులో పెద్దోరు. అందుకనే ఈ పేదోడు తవరి దగ్గరికి సిన్న కోరికతో వచ్చాడు" వినయంగా అన్నాడు రామయ్య.

"ఏవిటో చెప్పు రామయ్యా. నా దగ్గర సందేహిస్తా వేమిటి? ఒక వూరు వాళ్ళం- చాలా రోజులుగా తెలిసినవాళ్ళం. ఆర్థికమైన అంతరాన్ని అడ్డం పెట్టుకొని మనం మాట్లాడకూడదు. సంశయం లేకుండా యేమిటో చెప్పు" అన్నాడు రమణయ్య.

గంగరాజుకి వొళ్ళు మండింది. తండ్రి రామయ్యలాంటి వాళ్ళతో అంత సన్నిహితంగా యెందుకు మాట్లాడతాడో అతనికి అర్థంకాలేదు. ఏది ఏమైనా రామయ్యపట్ల తండ్రికి యేహ్యభావం కలిగేలా చూడాలనుకున్నాడు.

"రేపు సంవత్సరాది కదూ నాన్నా.... రామయ్యకి మనం కొత్త బట్ట లివ్వాలట. అదే వాడి బుల్లికోరిక. పేదవాళ్ళని కనికరిస్తున్నకొద్దీ వీళ్ళ కోరికలు అకాశాన్నంటుతున్నయ్." వెటకారంగా చెప్పుకుపోయాడు గంగరాజు.

రమణయ్య, కొడుకు మొహంలోకి చూశాడు. అతని కళ్ళలో ద్వేషం, క్రోధం, గూడుకట్టి వుండడం గమనించాడు. కొడుకులో ఆ మార్పువచ్చినందుకు రమణయ్య ఆశ్చర్యపోలేదు. ఎందుకూ అంటే పేదవాళ్ళని అసహ్యించుకోవడం యెద్దేవాచేసి మాట్లాడ్డం గంగరాజుకి మొదట్నుంచీ అలవాటే! అందుకనే అప్పు డప్పుడు రమణయ్య ఆలోచిస్తూ వుంటాడు-తదనంతరం వీడు వ్యవహారాన్ని యెట్లా సంబాళించుకోగలడా అని.

రమణయ్య ఆలోచనలకి రామయ్య అంతరాయం కలిగించాడు.


"సినబాబు సెప్పింది నిజవే రమణయ్యబాబూ. ఏనాడూ మిమ్మల్ని

నే నేమీ కోరనేదు. వొంటినిండా గుడ్డనేక యిబ్బంది పడుతున్నాను బాబూ. మీ దగ్గిరకి రాడానికి అభిమానం అడ్డొచ్చింది. కాని దాన్ని పంపేసుకొని యిట్టా వచ్చేసినాను. ఈ ఒక్క కోరిక తీరనండి బాబూ! నేను బతికున్నన్నాళ్లా మిమ్మల్ని గురుతుంచుకుంటాను. ఈ బతుక్కి యిదొక తృపితి." ప్రాధేయ పూర్వకంగా అన్నాడు రామయ్య.

రమణయ్య హృదయం అర్ద్రమయ్యింది. ఎన్ని అన్యాయాలు చేసినా, చేస్తున్నా, అతనికీ ఒక హృదయం వుందిగా మరి. రామయ్య మనస్తత్వం అతనికి బాగా తెలుసు. అతడిలో ఒకరికి చెయ్యిచాచే దుర్బలత లేదు. అయితే పరిస్థితుల ప్రభావం, మనిషిలో కొన్ని కొత్త బలహీనతల్ని తీసుకురావచ్చు ననుకున్నాడు. గతమంతా ఒక్కసారి రమణయ్య కళ్ళముందు లీలగా గిర్రున తిరిగింది. రామయ్య ఈనాడు ఈ దుస్థితికి రావడానికి కారకుడెవరు? తనేగా! అప్పులిచ్చి, తప్పుడు లెక్కలు వేసి, దొంగప్రాంసరీ నోట్లు సృష్టించి, నమ్మకాన్ని అతనిలో పెంచి, మంచితో అతణ్ణి వంచించి అతడి అస్తివంతా చేజిక్కించుకున్నాడు తనే. ఈనాడు తనదిగా వున్న మామిడితోట ఆ పక్కనే వున్న అయిదెకరాల మెరక ఒకప్పుడు రామయ్యవేనని అందరికీ తెలుసు. అయితేనేం-తను అతణ్ణి మోసగించినట్టు, తడిగుడ్డతో గొంతు కోసినట్టు యెవ్వరికీ తెలీదు. రామయ్యకూడా అలా అనుకోలేదు. ఇప్పటికీ గ్రహించలేదు. తనపట్ల ఈనాటికీ రామయ్యకి నమ్మకం, విశ్వాసం వుండటమే అందుకు నిదర్శనం. అంతటి సహృదయుడు రామయ్య. అటువంటి వ్యక్తి యీరోజు ఒక చిన్న కోరిక-అతిచిన్న కోరిక కోరాడు. అసలు రామయ్య కథే తెలీని ఈ కుర్రకారు గంగరాజు ముసలాడి కోరికను యెద్దేవా చేస్తున్నాడు. వాడికేం తెలుసు- తను అనుభవిస్తున్న ఆస్తిలో రామయ్య భాగం వుందని, డబ్బు యెట్లా వచ్చిందోనన్న జిజ్ఞాస వుండదుగా! తనకి డబ్బుందన్న అహంకారం మాత్రం చప్పున వచ్చేస్తుంది. మనిషి స్వభావం యింతే మరి.

"రామయ్యా రేపు వుదయం వచ్చి అగుపించు. తప్పకుండా కొత్త బట్ట లిస్తాను" అన్నాడు రమణయ్య సౌమ్యంగా.

రామయ్య మొహం విప్పారింది. కొత్త వెలుగేదో ముడతలుపడిన అతడి మొహాన్ని తేజోవంతం చేసింది. పెదాలు వొంపులు తిరుగుతూ చిన్న మంద హాసం చేశాయి. అతడి హృదయం పరవశంతో పొంగిపోయింది. జీవితంలో యేనాడూ అనుభవించని తృప్తి ఆ క్షణంలో చవిచూశాడు. రమణయ్యగారు




తన కోరిక మన్నిస్తున్నందుకే ఆ ఆనందం. తనని యెగతాళి చేసిన గంగరాజు ముందే తన కోరిక మన్నిస్తున్నందుకు మరీ మురిసిపోయాడు. అతని సంతోషం మాటల్లో చెప్పరానిది.

"రమణయ్యబాబూ. ఈ రోజు నా కెంత ఆనందంగా వుందో చెప్ప లేకుండా వున్నాను. నా కోరిక మన్నించారు. అంతే సాలు. మీ రిచ్చిన కొత్త బట్టలు యేసుకుని రేపంతా సరదాగా గడిపేస్తాను" మురిసిపోతూ అన్నాడు రామయ్య.

నిజం చెప్పాలంటే, గంగరాజుకి అదో అవమానంగా తోచింది. తన మాటకి బొత్తిగా విలువలేకుండా పోవడం అతని కోపాన్ని రెట్టింపుజేసింది.

"ఏమిటి నాన్నా మీ దాతృత్వం? ఇలాగే అడిగినవాళ్ళందరికీ ధర్మం చేస్తే, యింక మనం బాగుపడినట్టే" అన్నాడు గంగరాజు ఆవేశంతో. గంగరాజు యెప్పుడూ తండ్రికి యెదురుచెప్పలేదు. కాని, ఆ క్షణంలోనే అనేశాడు ఆవేశంతోనే.

రమణయ్య నిర్ఘాంతపోయాడు. ఏనాడూ యెదురుచెప్పని కొడుకు, యీరోజు తనని ప్రశ్నిస్తున్నాడా? ఇటువంటి క్షణం యెప్పుడైనా వస్తుందని అతనెప్పుడూ వూహించనేలేదు. అందుకే అతని మొహం జేవురించింది. రుస రుసలాడుతూ కొడుకేసి చూశాడు.

"రాజూ, నువ్వు నోరుమూసుకోరా. ఏది మంచో, ఏది చెడో నాకు తెలుసు. నీచేత చెప్పించుకునేటంతటి దుర్గతి నా కింక పట్టలేదు" కోపంగా అంటూ రామయ్యకేసి చూశాడు రమణయ్య.

"నువ్వు వెళ్ళు రామయ్యా. రేపు పొద్దున్నేవచ్చి బట్టలు తీసుకుపో. మావాడి మాటల్ని పట్టించుకోకు" అన్నాడు

రామయ్య మొహం వికసించింది.

"అలాగే బాబూ! మీ మంచితనం నా మనసులో యెల్లప్పుడూ నిలు మంటాది. వస్తాను బాబూ" ఆ ఆనందంలో యింకేమేమో చెప్పాలనుకున్నాడు గాని చెప్పలేకపోయాడు. రెండు చేతులూ జోడించి, సవినయంగా నమస్కరించి నిష్క్రమించాడు.

గంగరాజు కోపంతో కుతకుతలాడిపోతున్నాడు. రమణయ్య కొడుకేసి ఓరగా చూశాడు. బరువుగా నిట్టూర్చాడు.

"ఒరేయ్ రాజూ! ఆవేశం తెచ్చుకోవడమే నీకు తెలుసు గాని ముందు వెనుకలాలోచించడం తెలీదు. నీ కళ్ళముందు యింత వికృతంగా కనిపిస్తున్న రామయ్య పదిహేనేళ్ళ క్రితం యెట్లా వుండేవాడో నీకు తెలుసా!" గంభీరంగా చెప్పుకుపోయాడు రమణయ్య.

గంగరాజు తనకేం తెలీదన్నట్టుగ బేలమొహం వేసి తండ్రికేసి చూశాడు. అప్పుడే అతని ఆవేశంలో కొంత భాగం కరిగిపోయింది. రమణయ్య మళ్ళీ ప్రారంభించాడు.

"నీకు గుర్తులేకపోవచ్చురా రాజూ. అప్పట్లో ఈ రామయ్య వూళ్లో వుండే మోతుబరి రైతుల్లో ఒకడు. అతని అమాయకత్వం, మంచితనం, యితరుల కపటనాటకాలకి బలిచ్చాయి. ఆ మంచిగుణాలే అతణ్ణి యిప్పుడీ స్థితికి తెచ్చాయి. మన మామిడితోట, ఆ తోట పక్కనేవున్న అయిదెకరాల మెరక యెవరిదనుకున్నావు! మన పూర్వులు గడించి పెట్టిందికాదు. అవి రామయ్యవే. అయితే నేను వాటిని యెట్లా హస్తగతం చేసుకున్నానో ఆ వివరాలు నీకు అనవసరం. ఆనాటి రామయ్యను దృష్టిలో పెట్టుకొని, యీనాటి రామయ్యను చూస్తుంటే నిజంగా హృదయం ద్రవించుకుపోతుంది కాని ఏం చేస్తాం! ఒకరు నాశనమైతేగాని మరొకరు బాగుపడరు. ఒకరు అధోగతి పాలైతేనేగాని మరొకరు అందల మెక్కరు ఈ సూత్రాన్ని క్షణక్షణానికి జ్ఞప్తికి తెచ్చుకుని, మానవత్వమనే పదాన్ని మర్చిపోతాం. మర్చిపోవాలికూడాను. అయితే మాకూ హృదయం వుందని లోకానికి చాటేందుకు, అప్పుడప్పుడూ కాస్తంత వుదారంగా ప్రవర్తిస్తూ వుండాలి. అంచేత ఇప్పుడు రామయ్యకి మనం కొత్త బట్టలిచ్చినంత మాత్రాన మనకి పోయిందేమీ లేదురా. అతడి తృప్తి, సంతోషం యివే మనకి

ఆశిస్సులనుకో. నువ్వింకా అర్థంచేసుకోవల్సింది, నేర్చుకోవల్సింది చాలా వుందిరా రాజూ" అంటూ చిన్న ఉపన్యాసం యిచ్చాడు రమణయ్య.

గంగరాజు తండ్రికేసి కళ్ళప్పగించి చూస్తూ క్షణం వుండిపోయాడు. రామయ్యతో, తండ్రి ఎందుకంత చనువుగా మాట్లాడుతున్నాడో యిప్పుడటిపికి అర్థమయ్యింది. మరేం మాట్లాడలేకపోయాడు.

రమణయ్య చిన్న మందహాసం చేశాడు. "అలా ప్రకాశం బట్టల దుకాణంకి పోయి, ఓ పంచెలచాపూ, ఓ మంచి తువ్వాలూ తీసుకురారా; రేపు స్వయంగా నువ్వే రామయ్యకి యిద్దువుగాని" అన్నాడు కొడుకుని వుద్దేశించి.

గంగరాజు ఎదురు ప్రశ్నలు వెయ్యకుండా, మంత్రముగ్ధుడిలా అక్కణ్ణించి నిష్క్రమించాడు.

రమణయ్య తృప్తిగా నవ్వుకున్నాడు. అతని దృష్టిలో రామయ్య శిలగా మెదిలాడు.

* * *

రామయ్యకి ఆ రాత్రి చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు. అతడి ఆనందానికి అంతులేకపోయింది తెల్లారితే ఉగాది పండుగ. తెల్లారగానే పెద్ద బాబుగారు తనకి కొత్త బట్టలిస్తారు. అందరిలా తనూ కొత్తబట్టలు వేసుకుని, తిరుగుతాడు వూరంతా. తన కోరిక తీరుస్తున్న రమణయ్యగారికి యెంతో యిణపడివుంటాడు తను. ఎంతో మంచివాడు రమణయ్య. అయన కొడుకూ వున్నాడు ఎందుకూ? అయన కడుపున చెడబుట్టాడు. రేపు తను కొత్తబట్టలు వేసుకొని తిరుగుతూంటే గంగరాజు అసూయపడాలి. అసూయపడతాడు కూడాను. తండ్రిని మనసులో తిట్టుకుంటాడు. తిట్టుకోనీ తనకేం? తన కోరిక తీరుతోంది. తన కదే పదివేలు. అలా యెంతసేపు అలోచించాడో అతనికే తెలీదు. ఎప్పుడు నిద్రపట్టిందో అతడికి తెలీదు.

* * *

తెల్లవారింది. ఆ రోజు ఉగాది—

రోజూ కోడికూసే వేళకే లేచిపోయే రామయ్య ఆ రోజు తెల్లవారినా లేవలేదు. కొడుకు రంగడు వెళ్ళి తండ్రిని లేపాడు. ఇంకెక్కడి రామయ్య? అతడి భౌతిక దేహమే అచేతనంగా పడుంది.

రంగడు బావురుమన్నాడు. నలుగురూ చేరారు. కంటతడి పెట్టుకున్నారు. ఆ పేటలో ఆ రోజు ఉగాది పండుగలా లేదు. శోకదేవత నలుమూలలా తారాడింది.

రమణయ్యకి రామయ్య మరణవార్త తెలిసింది. ఎంతో బాధపడ్డాడు. క్రితం సాయంత్రమే తెచ్చిన కొత్తబట్టలు అతని కళ్ళముందు మెదిలినయ్. కంటతడి పెట్టుకున్నాడు. ఎప్పుడూ ఏమీ కోరని రామయ్య ఒక్క కోరిక కోరాడు. చివరికి ఆ కోరిక తీరకుండానే ఈ ప్రపంచంనుంచి వెళ్ళిపోయాడు. ఎంత దురదృష్టవంతుడు రామయ్య! అనుకుంటూ పరితపించాడు రమణయ్య.

రమణయ్య మనస్సు కొస్తంత వికలమయ్యిందనే చెప్పాలి. రామయ్య భౌతికదేహాన్ని ఓసారి కళ్ళారా చూడాలనిపించింది. రామయ్యకోసం కొన్న కొత్తబట్టలు అతడికే చెందాలనుకున్నాడు. ఆ కొత్తబట్టలు తీసుకుని రామయ్య ఇంటికి వెళ్ళాడు.

రమణయ్య ఆ పేటకి రావడం, అక్కడి వాళ్ళందరికీ ఆశ్చర్యమే కలిగించింది. రమణయ్య రంగణ్ణి దగ్గరగా పిల్చాడు.

"రంగా, చాలా ఘోరం జరిగిందిరా. మీ నాన్న కొత్తబట్టలు కోరాడురా. నిన్ననే తెప్పించాను. కాని, యేంలాభం? మీ నాన్న కోరిక తీరింది కాదు. అదే నా బాధంతాను. ఒక్క రాత్రిలో యిలా కథ ముగుస్తుందని యెవరనుకున్నాం. అతడి కోసం తీసికొచ్చిన ఈ బట్టలు అతడికే చెందాలి. ఈ బట్టలు అతడికి కట్టబెట్టెయ్. ఏంచేస్తాం? ఎవరికి యెంత ప్రాప్తమో, అంతే." అంటూ కంటతడి పెట్టుకుంటూ, కూడా తెచ్చిన కొత్తబట్టలు రంగడికి అందించాడు.

రంగడు బావురుమన్నాడు. "అయ్యా యిదిగో అయ్యా నువ్వు అడిగిన కొత్తబట్టలు. పెద్దబాబుగారు తెచ్చారు" రుద్ధస్వరంతో అంటూ తీసుకొనిపోయి రామయ్య భౌతికదేహానికి కట్టబెట్టాడు.

కొత్తబట్టల్లో రామయ్య భౌతికదేహాన్ని చూసి రమణయ్యే కాదు- అక్కడున్న వాళ్ళంతా వలవలా [illegible]

రామయ్య శవాన్ని దహనక్రియలకై తీసుకుపోతున్నారు. రమణయ్య కొంతదూరం వెళ్ళి యింటిముఖం పట్టాడు. ఓ చోట [illegible] శవయాత్రను చూస్తున్న గంగరాజు [illegible] కంటతడి పెట్టుకున్నాడు. అతనిలో మెదిలిన పశ్చాత్తాపం [illegible] నివ్వలేదు. ఏదో తప్పుచేసినవాడిలా మొహం దాచుకుంటూ అక్కడినుండి కదిలిపోయాడు. అతని కళ్ళల్లో రామయ్య రూపం మెదుల్తూనే వుంది

---